


భార్యా భర్తలైన తర్వాత ఆ స్తమానము ప్రేమాభిమానాలు వలక పోసుకుంటూ కూచుంటే వాళ్ళ దాంపత్యం బోరు కొడుతుంది. మధ్య మధ్యలో అలగడా లుండాలి, బుజ్జగింపు లుండాలి, మవున వ్రతాలుండాలి. మెత్తని చెంప పెట్టులుండాలి. కన్నీళ్ళు చూడాలి. మల్లెపూలు తేవాలి. ఈ హంగులన్నీ వుంటే రంజుగా సాగుతుంది సంసారం.

అట్లా అని చెప్పి, వరస అలగడాలూ, ఫటా ఫట్ దెబ్బలూ, పీర శోకాలూ, నిత్య రభస ఆ యింటికి శోభ నివ్వదు. ఎవరేనా హద్దుల్లో వుంటేనే అందం. మా ఆవిడతో సాధారణంగా నాకు పోట్లాట రాదు. ఎంచేత

నంటే నేనెప్పుడూ ఆవిడ మాటకి ఎదురు చెప్పను. ఎంతయినా మగవాడ్ని. పోషిస్తున్న వాడిని గనక అప్పుడప్పుడు కొంచెం అలగడం మామూలు. ఈ అలగడం రెండు మూడు రోజులుంటుంది. ఈ రోజుల్లో నేను ఆవిడ్తో గాని, ఆవిడ నాతో గాని మాట్లాడుకోము. పిల్లలు మాత్రం ఆ రెండు మూడు రోజులూ హైరానా పడిపోతుంటారు. ఒరే రవణా నా కళ్ళజోడెక్కడ్రా అంటాను. వాడు 'అమ్మా, నాన్న కళ్ళజోడుచే' అనివాళ్ళమ్మని అడుగుతాడు. ఆవిడ వెతికి కళ్ళజోడు రవణ చేతిలో పెడితే, వాడు దాన్ని నా కళ్ళకు తగిలిస్తాడు. ఒరే శీనూ వడ్డించేను అంటుంది మా ఆవిడ. మా రెండోవాడు గజ మొండి నేనిప్పుడేగా భోం చేశాను. మళ్ళా ఎందుకు వడ్డించేవూ అని అరుస్తాడు. నీక్కాదులేరా, నాన్నకి అంటాడు రవణ. అట్లాంటప్పుడు నాకెందుకు చెప్పాలి. అని ఆర్గ్యూ చేస్తాడు శీను. వాళ్ళ తర్జన భర్జనలు పూర్తయ్యేలోగా నేను భోంచేసి తాంబూళం గూడా బిగించేస్తాను. బాలాజీ, నీళ్ళు తోడమను అంటాననుకోండి. మూడోవాడు పసివాడు, అందువల్ల వాడి పేరెత్తి పని పురమాయించగానే క్షణంలో సిద్ధం చేస్తుంది మా ఆవిడ.

మా ఇద్దరి మధ్యా ఏర్పడే తాత్కాలిక భేదాభిప్రాయాల వల్ల పిల్లల పేర్లు నిమిషానికి అరవైసార్లు మాఇంట్లో వినిపిస్తుంటాయి. ఇంటికి బంధువులొచ్చినా, స్నేహితులొచ్చినా రాజీ పడేది లేదు. హోరాహోరీగా పిల్లల్ని సాధించి పనులు పురమాయించడం జరుగుతుంది. మేము ఎడ మొహం, పెడ మొహం పెట్టగానే "నాన్నా! మమ్మల్ని స్కూలుకి ఎన్నిరోజులు సెలవు పెట్టమంటావు?" అని అడిగేస్తాడు శీను. సిగ్గుతో చావాలి.

వెంకట్రావు కోసం వాళ్ళింటి కెళ్ళేను. అతనికి ఒక్కడే సంతానం. వాడిపేరు బుజ్జి. నాలుగేళ్ళు నిండలేదు. పొట్టనిండా మాటలే. ఎప్పుడు వెళ్ళినా వాడితో అర గంటయినా ఆడుకుంటాను. అట్లాంటిది నన్ను చూడగానే గబగబా బట్టలు మార్చుకున్నాడు వెంకట్రావు. పద పదమని నన్ను తొందర

చేసేడు. వస్తుండగా వెంకట్రావు భార్యపిలుపు వినిపించింది "బుజ్జీ, కూరలు నిండు కున్నాయి". అని వెంకట్రావు వైపు చూసేను. మేము పోట్లాడుకుని యిది రెండోరోజు అన్నాడు వెంకట్రావు. నాకా మాత్రం తెలీదా? కూరలు నిండుకున్నాయంటే నాలుగేళ్ళ బుజ్జి బజారుకు వెళ్ళి ఏం కొంటాడు.

పిల్లలు లేనివాళ్ళూ, వున్నవాళ్ళూ సమయానికి ఇంట్లో లేనప్పుడు ఆ భార్యాభర్తల సంభాషణ బహు తమాషాగా వుంటుంది. గోడని చూసి కాఫీ అంటాడు మొగుడు. తలుపు వేపు దృష్టి నిలిపి కాఫీపొడి నిండుకుంది అంటుంది పెళ్ళాం. కిటికీ రెక్కని ఫెడీల్మని గట్టిగా కొట్టి "ఛీ దరిద్రం కొంప" అంటాడు అతను. చేతిలో పుస్తకాన్ని పారేసి నా ఖర్మ అంటుం దామె. మంచాన్ని తంతాడతను. పరుపులాగి పారేస్తుందామె. పెన్నూ, వాచీలూ విష్ణుచక్రాల్లా ఎగుర్తాయి. అలుగు అధ్యాయం ముగిసిం తర్వాతకాని తెలీదు అసలు నష్టమెంతో.

అలగడం వరకూ ఫర్లేదు గాని, అదియుద్ధం వరకూ ఎదిగితే ప్రేక్షక మహాశయులకు రోత కలిగిస్తుంది. పిడిగుద్దులూ, ముష్టియుద్ధాలూ, కుస్తీ పట్టులూ రకరకాల ధోరణితోసాగే యుద్ధంలో యిల్లే రణరంగమవుతుంది. గనక ఆ యింటికి కొన్ని డేమేజీలు కలగడం కూడా కద్దు. సొంత యింట్లో బాధలేదు. గానీ అద్దె కొంపల్లో యుద్ధాలు యింటి ఓనరుకి బోల్డంత నష్టం. తలుపులు పగులుతాయి, కిటికీలు ధ్వంసమవుతాయి, గోడలకి పెచ్చులూడు తాయి. నానా బీభత్సం. దాంతో యింటి ఓనరుకి పిచ్చెక్కాల్సినదే. వేరే మార్గంలేదు. పిల్లా మేకా లేని భార్యాభర్త లిద్దరే గదాని ఎంతో ముచ్చటపడి యిల్లు అద్దెకిస్తే, నెలరోజుల్లో యిరవై రోజుల యుద్ధకాండతో యింటిని గొడ్లచావిడి చేసేరుట ఆదర్శ దంపతులు. ఈవిషయం చెప్పి భోరునఏడ్చేడు మలక్‌పేట ఆసామి.

మొన్నీ మధ్యనే చదివేను ఫ్రాంకుఫర్ట్ ఉత్తమ యిల్లాలు గురించి. ఆమెకి మొగుడి మీద తరచూ కోపం వస్తూంటట. కోపం వచ్చినప్పుల్లా

యింట్లో వస్తువుల్ని ధ్వంసం చేయడం ఆమె హాబీనట. పెళ్ళయిన మూడేళ్ళలో మూడు డజన్‌ల టీ సెట్లు, రెండు డజన్ల డిన్నర్ సెట్లు, 500 గాజు గ్లాసులు బద్దలు కొట్టిందట ఆ మహా యిల్లాలు. ఆ మానవుడు ఈ అరాచకం భరించలేక సుబ్బరంగా విడాకులు పుచ్చుకున్నాడట. పుచ్చుకోక ఛస్తాడా?

కృష్ణుడిమీద కోపమొచ్చి అతని ఛెస్టుమీద ఫెడేల్మని కాల్తో కొట్టింది సత్యభామ. సరసం తెలీని మొరటోడు అయితే సత్యభామ పీక పిసికి అంతు చూసేవాడు. కానీ, గురుడు తొందరపడలేదు. కొడితే కొట్టావు గాని నీ కాలికెంత దెబ్బ తగిలిందో గదా సత్యా అంటూ వాపోయాడు ఆ పరమాత్మ. అతనికి రొమాన్సు తెలుసు, ఆడవాళ్ళ బలహీనత తెలుసు, వాళ్ళ నెట్లా పడ కొట్టాలో బాగా తెలుసు. అంత తెలిసిన మేధావి గనకనే ఆరువేల మందిని కట్టుకున్నాడు ఇప్పటి జనానికి ఆ ఓపికేది? ఆ లాలింపేది? ఆ చమత్కారమేది?